ప్రజాశక్తి
శుక్రవారం 20 డిసెంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు



అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని ఐసీడీఎస్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుల భర్తీకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని స్థానిక సీడీపీవో నీలిమ తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని బలియగుడ, సాయినగర్, కాగువలస, కూడ, బుడ్డింగి కేంద్రాల్లో ఆయా పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆయా పోస్టులకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు స్థానికులై ఉండాలన్నారు. పదో తరగతి అర్హత కలిగి ఉండి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. వితంతువులు, అనాథ, వికలాంగులకు వెయిటేజీ మార్కులు ఉంటాయని చెప్పారు. ఈనెల 31లోపు కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని ఆమె కోరారు.

పెదబయలు : మండలంలో అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ మో ద వరహాలమ్మ గురువారం ఒక ప్రకటనలో కోరారు. వివాహితులు స్థానికంగానే నివాసం కలిగి ఉండాలన్నారు. మౌఖిక పరీక్ష తేదీ తరువాత ప్రకటిస్తామని పేర్కొన్నారు.

సెల్ టవర్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

-కలెక్టర్ దినేష్ కుమార్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: మొబైల్ సెల్ టవర్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుండి ఐటిడిఏ పి.ఓలు, సబ్ కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు, జియో, ఎయిర్ టెల్, బి.ఎస్.ఎన్.ఎల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెల్ టవర్లు నిర్మాణానికి సమగ్రమైన సర్వే చేసి జిల్లా స్థాయి కమిటీలో చర్చించి అనుమతులు జారీ చేస్తామన్నారు. జి.మాడుగుల, పెదబయలు, అనంతగిరి, ముంచంగిపుట్టు మండలాల్లో సమస్యలను పరిష్కరించి సెల్ టవర్లు నిర్మించాలని సూచించారు. కొయ్యూరు మండలం వెలగలపాలెం గ్రామంలో జియో టవర్ నిర్మాణానికి సంబంధి భూ యజమానులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని చెప్పారు. 139 ఎయిర్ టెల్ టవర్లకు 136 టవర్లు రేడియేషన్ అందిస్తున్నాయన్నారు. మిగిలినవి త్వరగా పనులు ప్రారంభించాలని సూచించారు. బి. ఎస్.ఎన్.ఎల్ 395 టవర్లలో 302 టవర్లు పూర్తి చేసారని మిగిలినవి త్వరగా పూర్తి చేయాలని బి ఎస్ ఎన్ ఎల్ అధికారులను ఆదేశించారు. రంపచోడవరం డివిజన్ పరిదిలో 364 టవర్లకు 207 టవర్లకు రేడియేషన్ అందిస్తున్నాయని మిగిలిన 157 టవర్లు మార్చి నెలాఖరునాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నిర్దేశించిన ప్రతి సైటులోను సెల్ టవర్లను పూర్తి చేయాలన్నారు. సెల్ టవర్లకు కేటాయించిన భూములను సర్వే పూర్తి చేయడానికి బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో పర్చువల్గా చింతూరు పిఓ అపూర్వ భరత్, జియో, ఎయిర్టెల్, బి.ఎస్.ఎన్.ఎల్. అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అరకు ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష

పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెలాఖరున అరకు ఉత్సవంను నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. అరకు ఉత్సవం ఏర్పాట్లపై కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో గురువారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడు రోజులు అరుకు ఉత్సవాన్ని విజవంతంగా నిర్వహించడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. పట్టణంలో సుందరంగా విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఉత్సవం ప్రాంగణంలో వివిద స్టాల్స్ పెట్టాలన్నారు. మూడు రోజుల ఉత్సవం నిర్వహించడానికి వివిద రకాల సాంస్కతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. మారథాన్, చిత్రలేఖనం, రంగోలి, కార్నివాల్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గులాబీల ప్రదర్శన, హాట్ ఎయిర్ బెలూన్, ఎగ్జిబిషన్ స్టాల్స్, కాఫీ రుచుల పోటీలు, గిరిజన కళాకారుల సాంస్కతిక ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటకులకు మంచి అనుభూతి కలిగే విధంగా ఉత్సవం నిర్వహణ ఉండాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి బి. లవరాజు, డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్.కుమార్, అరకు వ్యాలీ తహశీల్దార్ ఎం.వి.వి. ప్రసాద్, ఎం.పి.డిఓ ఎ.లవరాజు, మ్యూజియం మేనేజర్ మురళీకృష్ణ, జిల్లా టూరిజం అధికారి జి. దాసు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలపై సిపిఎం ఖండన

ప్రజాశక్తి-పాడేరు: రాజ్యసభలో జరిగిన చర్చలో బి. ఆర్.అంబేద్కర్‌ను కించపరిచేలా కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను సిపిఎం కార్యదర్శి పి.అప్పలనరస గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. భారత రాజ్యాంగం రూపశిల్పి అంబేద్కర్‌పై అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అమిత్ షాకు హోంమంత్రిగా కొనసాగే హక్కు లేదన్నారు. ఇటువంటి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ప్రజాతంత్ర వాదులు, మేధావులు, లౌకిక, సామాజిక వాదులు సంఘాలు నిరసనలు తెలియ చేయాలని పిలుపునిచ్చారు.

పాడేరు : అంబేద్కర్‌ను అవమానిస్తూ పార్లమెంట్లో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వాక్యాలను ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ధర్మన్న పడాల్, బాలదేవ్ తీవ్రంగా ఖండించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర హోం మంత్రిపై చర్యలు తీడుకోవాలన్నారు. దేశ ఐక్యతకు ప్రమాదకరమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. భారత రాజ్యాంగం పై ప్రమాణం చేసి పదవి అనుభవిస్తున్న అమిత్ షా జాతికి క్షమాపణలు చెప్పి హోం మంత్రి పదవికి రాజీనామా చేయాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

అరకులోయ రూరల్: బిఆర్ అంబేద్కర్ పై అవమానకరంగా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి జి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ప్రత్యేక చట్టాలు ఉన్నాయంటే అది కేవలం అంబేద్కర్ కృషి వల్లే వచ్చాయని తెలిపారు. అటువంటి మేధావి పై ఇటువంటి అమానుష వ్యాఖ్యలు చేసి మాట్లాడటం సరికాదన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జి.సత్యారావు, బుద్రయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సేవా సంఘం నేతలు

స్థానిక యువతకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అల్లూరి యువజన సేవా సంఘం అధ్యక్షుడు కె.సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈ జలపాతాన్ని ఎకో టూరిజం పేరిట ఐటీడీఏ నిర్వహణకు తీసుకొని సుమారు రెండేళు నడుస్తుందన్నారు. స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించకుండా బయట వారితో నిర్వహణ సాగించడంతో స్థానికులు ఉపాధి కోల్పోతున్నారని చెప్పారు. తక్షణమే ఐటిడిఏ అధికారులు స్పందించి స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అల్లూరి యూత్ నాయకులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

కాంట్రాక్టు టీచర్లుగా మార్చకుంటే ఉద్యమం ఉధృతం

- 2వ రోజుకు గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల రిలే నిరాహార దీక్షలు
- సిఐటియు, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం సంఘీభావం



మాట్లాడుతున్న సిఐటియు, గిరిజన సంఘం నేతలు శాంతిరాజు, సిరిమల్లిరెడ్డి

ప్రజాశక్తి-రంపచోడవరం

గిరిజన గురుకుల పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఉపాధ్యాయులను కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా మార్చకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి పేర్కొన్నారు. రంపచోడవరం ఐటీడీఏ వద్ద గురుకులాల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి రెండో రోజు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన సిఐటియు, గిరిజన సంఘం నేతలు మాట్లాడుతూ గిరిజన గురుకుల పాఠశాలల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ మొండి వైఖరి సరికాదన్నారు. సాధారణంగా చనిపోయిన లేదా రిటైర్ అయిన వారి స్థానాలలో డీఎస్సీ నియామకాలను చేపడతారని, కాని ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేవారిని తొలగించి, వారిని పార్ట్ టైం ఉపాధ్యాయులుగా మార్చే పరిస్థితి దేశంలో ఎక్కడా లేదన్నారు. గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోస్టులను డీఎస్సీ నుండి మినహాయించాలని డిమాండ్ చేశారు. 2022 పిఆర్సి ప్రకారంగా వేతనాలు పెంచాలని, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులుగా ప్రమోట్ చేయాలని కోరారు.

ఎమ్మెల్యే శిరీషాదేవికి వినతి

గిరిజన గురుకుల ఔట్సోర్సింగ్ టీచర్లు గురువారం ఉదయం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి నివాసానికి వెళ్లి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. 2024 డీఎస్సీలో తమ పోస్టులను కలపడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. 15, 20 సంవత్సరాల నుంచి అతి తక్కువ జీతాలతో పని చేస్తున్నామని, ఉదయం మొదలుకొని రాత్రి వరకు గురుకులాల్లో ఉండి సేవ చేస్తున్నామని తెలిపారు. తమను ఔట్సోర్సింగ్ విధానం నుండి కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలని నవంబర్ 4వ తేదీ నుండి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా మారైనా తమ సమస్యలపై సంబంధిత మంత్రులు, అధికారులతో మాట్లాడి న్యాయం చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు శామ్యూల్, తాతాజీ, సత్యనారాయణ రెడ్డి, విద్యార్థి సంఘాల జెఏసి గౌరవ అధ్యక్షులు ఐవి రమణ, యుటిఎఫ్, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శిరీషాదేవికి వినతిపత్రం ఇస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణపై నిరసన

ప్రజాశక్తి-సీలేరు

కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ జీకే వీధి మండలం సీలేరులో ఏపీ జెన్కో ఇంజనీర్లు, ఉద్యోగులు స్థానిక ఎస్ఈ సివిల్ కార్యాలయం ఎదుట గురువారం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. 'కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి నశించాలి', 'సేవ్ పవర్ సెక్టర్- సేవ్ ఇండియా', 'విద్యుత్ సవరణ చట్టం-2022 బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ వై.సత్తిబాబు మాట్లాడుతూ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జేఏసీ పిలుపుమేరకు విద్యుత్ సంస్థలు ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవడానికి ఈ నిరసన చేపట్టినట్లు చెప్పారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని పొల్లూరు, డొంకరాయి, సీలేరు జల విద్యుత్ కేంద్రాల్లో ఏపీ జెన్కో ఇంజనీర్లు కార్మికులు మధ్యాహ్నం 12 గంటలకు భోజన విరామ సమయంలో ఐక్యంగా నిరసన తెలియజేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను స్వస్తి పలకాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కార్యాలయ సిబ్బంది,. ఏపీ జెన్కో కార్మిక సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న ఎపి జెన్‌కో ఉద్యోగులు

వెలగని వీధి లైట్లు

-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అరకు లోయ మండలం పద్మాపురం మేజర్ పంచాయతీ పరిధిలోని యండపల్లివలసలో వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో, ఆ వీధి వాసులు అంధకారంలో గడుపుతున్నారు.సుమారు నెలరోజులుగా వీధి దీపాలు వెలగక పోయినా అధికారులు ,పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పంచాయితీ కార్యదర్శికి పిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. వీధి దీపాలు వెలగాక రాత్రి సమయం బయటకు రావాలంటే చీకటిగా ఉండడంతో భయపడుతున్నారు. రాత్రివేళ విషపు రుగులు సంచరిస్తుండటంతో వీధి వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధిలైట్లను వేయాలని యండపల్లివలస వాసులు కోరుతున్నారు.



వెలుగని వీధి లైటు



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ డివిజన్ డిఎస్‌పి

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి-చింతపల్లి : పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, వార్షిక తనిఖీల్లో భాగంగానే చింతపల్లి పోలీస్ స్టేషన్‌ను చింతపల్లి సబ్ డివిజన్ డిఎస్పి షేక్ షహబాజ్ అహ్మద్. గురువారం సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పురోగతిపై సీఐ వినోద్ బాబు, ఎస్సై వెంకటేశ్వర్లను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేసులు నమోదు చేస్తున్న రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి గంజాయి సాగు నియంత్రించా లన్నారు. గంజాయి మైదాన ప్రాంతాలకు అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు నేరస్తులపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలన్నారు. లంబసింగితో పాటు ఇతర ప్రాంతాలు పర్యాటక ప్రాంతాలు కావడంతో కొత్త వ్యక్తులు సంచరించి గంజాయి రవాణా చేస్తుంటారని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ తాతలు, అప్పారావు, సూరిబాబు, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

పిఓ అభిషేక్ పర్యటన

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలో ఈనెల 21న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటనలో భాగంగా జిల్లా ఉన్నత అధికారులు హడావిడిగా పరుగులు తీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే విన్నకోట పంచాయతీ గుమ్మంతి గ్రామంలో గురువారం ఐటీడీఏ పిఓ అభిషేక్ పర్యటించారు. ఈనెల 21వ తేదీన దాయర్తి .గుమ్మంతి రోడ్డు శంకుస్థాపనకు ఉపముఖ్యమంత్రి రానున్నారని తెలిపారు.



సమస్యలు తెలుసుకుంటున్న పిఓ

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన విశ్వనాథ్

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: కృష్ణా జిల్లా గుడివాడలో జరిగిన 44వ రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలం రంగినివలస గ్రామానికి చెందిన గిరిజన యువకుడు కొర్ర విశ్వనాథ్ సత్తా చాటి మూడు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. గుడివాడ ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియంలో ఈనెల 14నుంచి రెండు రోజుల పాటు పరుగు పందెం పోటీలు జరిగాయి. 400 మీటర్ల పరుగుపందెంలో మొదటి స్థానం, 400 మీటర్లు రిలే పరుగులు పందెంలో రెండో స్థానం, లాంగ్ జంప్ రెండో స్థానం సాధించి బంగారు పతకాలను గెలుచుకున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 6 నుంచి 8వ తేదీ వరకు రాజస్థాన్‌లోని ఆళ్వార్ వద్ద జరిగే జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు కొర్ర విశ్వనాథ్ ఎంపికయ్యారు. ఇప్పటివరకు వివిధ అథ్లెటిక్స్ మీట్ పరుగు పందెంలో పలు కేటగిరీల నుంచి 7 పతకాలను సాధించినట్టు ఆయన విలేకరులకు తెలిపారు.



పతకాన్ని చూపుతున్న విశ్వనాథ్

120 పంచాయతీల్లో పీసా కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని 120 పంచాయితీ పరిధిలో గ్రామాలలో పీసా కమిటీల ఉపాధ్యక్షులు, కార్యదర్శుల ఎన్నికలు జరిగాయని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్‌లో పిఓ సింహాచలం మాట్లాడుతూ ఈనెల19న నుండి 24వ తేదీ వరకు పీసా కమిటీల గ్రామసభలు నిర్వహించి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రంపచోడవరం మండలంలోని 19 పంచాయితీలకు 49 గ్రామసభలు, అడ్డతీగలలో 22 పంచాయతీలకు 28 గ్రామ సభలు, రాజవొమ్మంగిలో 19 పంచాయితీలకు 60 గ్రామసభలు, గంగవరంలో 17 పంచాయితీలకు 23 గ్రామసభలు, మారేడుమిల్లిలో 12 పంచాయతీలకు 36 గ్రామసభలు, వై.రామవరంలో 17 పంచాయితీలకు 56 గ్రామసభలు, దేవీపట్నంలో 14 పంచాయతీలకు 28 గ్రామసభలు, మొత్తం 120 పంచాయితీలలో 180 పీసా కమిటీల గ్రామసభల ద్వారా పీసా కమిటీల ఎన్నిక జరిగినట్లు చెప్పారు. ఈ పీసా గ్రామసభల ఎన్నికలను సద్వినియోగం చేసుకోవాలని పిఓ సూచించారు.

పీసా గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

మారేడుమిల్లి : మండలంలోని కుండాడ గ్రామ పంచాయతీలో శుక్ర, శనివారాల్లో నిర్వహించే పీసా గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ సర్పంచ్ వెట్టి దుర్గాప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ముంజమామిడి, మల్లిసాల, కుండాడ గ్రామాలకు కుందాడ గ్రామంలో మధ్యాహ్నం 1.30 నుండి సాయంత్రం 4.30 వరకు, కడుమూరు, తూరు మామిడి గ్రామాలకు శనివారం తూరు మామిడి గ్రామంలో మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 వరకు ఈ గ్రామసభలు జరుగుతాయని చెప్పారు.

ముందస్తు సమాచారం లేకుండా గ్రామసభలు సరికాదు

దేవీపట్నం : ముందస్తు సమాచారం ఇవ్వకుండా పీసా గ్రామసభలు, ఎన్నికలు నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని ఆదివాసీ జేఏసీ, పారా లీగల్ వాలంటీర్లు తెల్లం శేఖర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీసా గ్రామసభ ఎన్నికలకు సుమారు నెల రోజుల ముందు నుంచే అధికారికంగా మీడియా ద్వారా ప్రకటన చేయాలని, గ్రామాలలో దండోరా ద్వారా టాంటాం చేయాలని, ఇంటింటికీ డోర్ పోస్టర్లు అతికించాలని, మైక్ ద్వారా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. కాని ఈ నిబంధనలకు విరుద్ధంగా ఆదివాసీ ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఈ 19 నుండి 24వ తేదీ వరకు పీసా గ్రామసభ ఎన్నికలు నిర్వహించడం దారుణమన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయకుండా డబ్బులెలా డ్రా చేశారు?

- పర్సంటేజీలు వసూలు చేస్తున్న టిడబ్ల్యు డిఇపై చర్యలు తీసుకోవాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఆకుమామిడి కోట నుండి గుత్తెడు వరకు వెట్ మిక్స్ వేసి, రోడ్డు నిర్మాణం చేయకుండా డబ్బులు ఎలా డ్రా చేశారని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు ప్రశ్నించారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గుడిసె రోడ్డుకు రూ.12 కోట్ల మంజూరు కాగా, సొంత కాంట్రాక్టర్ల కోసం అనుమతులు పేరుతో వాటిని రద్దు చేయడం సరికాదన్నారు. సొంత కాంట్రాక్టర్లతో ఇష్టానుసారంగా నాణ్యత లేకుండా పనులు చేయిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు మంజూరైన రోడ్లను సక్రమంగా పూర్తి చేయకుండా వేట్‌మిక్స్ వేసి వదిలేసి డబ్బులు డ్రా చేస్తూ అధికారులే దగ్గరుండి అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. ఐటీడీఏ పరిధిలో కొంతమంది కాంట్రాక్టర్లను అధికారులే దగ్గరుండి తీసుకువచ్చి బినామీ పేర్లతో పనులు చేస్తున్నారని, ఈ వ్యవహారంలో ట్రైబల్ వెల్ఫేర్ డిఈ చైతన్య కీలకంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు, మంత్రులు, కమిషనర్లు పేర్లు చెప్పి కాంట్రాక్టర్ల నుండి పర్సంటేజ్ వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు రంపచోడవరం ఐటిడిఏ పరిధిలో డిఇ చైతన్య ఎగ్జిక్యూట్ చేసిన ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్స్ వర్క్స్‌పై క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలతో ఎంక్వైరీ చేయించాలని, దీనికి కలెక్టర్, ఐటిడిఏ పిఓ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో రోడ్ల అభివృద్ధికి ఆటంకంగా మారిన చైతన్యను బదిలీ చేయకపోతే ఆందోళన తప్పదని ప్రభుత్వాన్ని లోతా రామారావు హెచ్చరించారు. నిధులను సక్రమం ఖర్చు చేయకుండా అధికారులే దుర్వినియోగానికి పాల్పడుతుంటే ప్రభుత్వం ఎందుకు చూస్తూ ఊరుకుంటుందని ప్రశ్నించారు. నియోజకవర్గ పరిధిలో మంజూరైన రోడ్లను తక్షణమే నిర్మాణం చేయకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లు వేయడానికి ఆటంకంగా మారిన పరిస్థితులపై కలెక్టర్ జోక్యం చేసుకోవాలని లోతా రామారావు కోరారు.

పిహెచ్‌సిల్లో ఐటిడిఎ పిఓ తనిఖీలు

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం మండలం సీతపల్లి, పెద్ద గెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని ఆదేశించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వివిధ వ్యాధులకు సంబంధించిన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ఏజెన్సీలోని సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు.



వైద్యాధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఐటిడిఎ పిఓ సింహాచలం

రహదారిని నిర్మించరూ..

ప్రజాశక్తి- అనంతగిరి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిన్నకోట పంచాయతీ దాయర్తి, .రాచకిలం గ్రామాలకు తారు రోడ్డు నిర్మించడానికి చొరవ తీసుకోవడం అభినందనీయమని, అదే విధంగా లుంగపర్తి పంచాయతీ ఒనుకొండకు తారు రోడ్డు ఏర్పాటు చేయాలని ఒనుకొండ, మల్లు గుమ్మి, మెట్టవలస, ఎర్ర మెట్టు తదితర గ్రామాల గిరిజన ప్రజలు కోరారు. నిర్మించిన మట్టి రోడ్డు వర్షాల కారణంగా భారీ స్థాయిలో కోతకు గురైందన్నారు. దీంతో కాలినడక,. దిచక్రవాహనాలు వెళ్ళలేని పరిస్థితి నెలకొందన్నారు.ఈనెల 21న మండలంలోని దయార్తి. రాసకిలం గ్రామాల రోడ్డు శంకుస్థాపనకు వస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తమ రోడ్డు సమస్యపై కూడా దృష్టి పెట్టాలని గ్రామస్తులు వేడుకున్నారు. రోడ్డు సౌకర్యం లేక రోగులకు ఆసుపత్రులలో డోలీల్లో తరలించవలసిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

ప్రజాశక్తి-పాడేరు: కలెక్టరేట్‌లో ఈనెల 20న మధ్యాహ్నం 4 గంటల నుండి ప్రభుత్వ ఉద్యోగులు గ్రీవెన్స్ నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల నుండి ఫిర్యాదులు స్వీకరించి ఆ దిశగా పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారు. ఉద్యోగుల గ్రీవెన్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

త్వరితగతిన రోడ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి-పాడేరు: మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్ల నిర్మాణాలు నిర్దిష్టమైన గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐటిడిఏ పిఒలు, పంచాయతీరాజ్, పిఐయు, రహదారులు భవనాలు శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలానికి ముందుగానే రోడ్లు, వంతెనల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. పాడేరు డివిజన్ పరిధిలో రహదారులు, వంతెన నిర్మాణాలకు 29 పనులు మంజూరు చేయడం జరిగిందన్నారు. 10 పనులకు అటవీ శాఖ అభ్యంతరాలు ఉన్నాయని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకుని రాగా అటవీ శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాసి అనుమతులు తీసుకుంటామని చెప్పారు.ఈ సమావేశంలో చింతూరు ఐటిడిఏ పి.ఓ అపూర్వ భరత్, రంపచోడవరం పి.ఓ కె.సింహాచలం, డి. ఇఇ. రవికుమార్, రవికుమార్, ఐటిడిఏ పరిపాలనాధికారి హేమలత పాల్గొన్నారు.

22న మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని పద్మాపురం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో పింపలుగుడ గ్రామంలో ఈనెల 22న మమత చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు జన్ని గోపాల్, ఎం.లచ్చు, కిల్లో మహేష్ చెప్పారు. ఈ మెగా వైద్య శిబిరానికి అరకులోయ సబ్ ఇన్స్పెక్టర్, స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్‌కు ఆహ్వాన పత్రం ఇచ్చామన్నారు ఆయా గ్రామాల ప్రజలు ఈ మెగా వైద్య శిబిరంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మైనారిటీల హక్కులపై శిక్షణ

సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మైనారిటీల హక్కుల దినోత్సవం సందర్భంగా వారి సాధికారత, రక్షణ, న్యాయ పరంగా వారికి ఉన్న హక్కుల గురించి జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ జడ్జి కమ్ జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మైనారిటీ వర్గాలకు ఉన్న హక్కుల గురించి వివరించారు. సీనియర్ న్యాయవాది ఐఎం.అహ్మద్ మాట్లాడుతూ, రాష్ట్రాల వారీగా మైనారిటీల రక్షణ చట్టం, వక్ఫ్ బోర్డు ఆస్తుల రక్షణకు సత్వర న్యాయం, సచార్ కమిటీ, రంగనాథ్ మిశ్రా కమిటీ రిపోర్ట్ ఆమోదం అంశాలు పార్లమెంట్‌లో ఆమోదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి జ్యోతి మాధవి, వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ అహ్మద్, సీనియర్ న్యాయవాదులు ఆర్.శ్రీనివాసరావు, ముస్లిం, క్రిస్టియన్, జైన్ మత పెద్దలు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి సహకరించాలి

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది.గురువారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఏఎస్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో మినీ కాన్ఫరెన్స్ హాల్లో జీవితకాల చందాదారులతో సమావేశం నిర్వహించి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా జిల్లా కలెక్టర్ ప్రకటించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు రక్తదానం చేయడం పై అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల గిరిజనులకు అవగాహన కల్పించి, రక్తహీనతతో బాధపడే బాలబాలికలకు గుర్తించి బలమైన పోషకాహారం తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విపత్తు సంభవించిన సందర్భాలలో రెడ్ క్రాస్ తరపున సేవలందించాలని జిల్లాలో ఉన్న స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకొని రక్తదాన శిబిరాలు,జీవితకాల చందాదారులను చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో 1000 మందికి తగ్గకుండా జీవితకాల చందదారులను చేర్పించాలన్నారు.వైద్య శిబిరాలు, కంటి వైద్య శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రక్తపు నిలువలను మరింతగా పెంచాలని సూచించారు. చింతూరు, రంప చోడవరం డివిజన్‌లో రెడ్ క్రాస్ శాఖను నిర్వహించేందుకు ఐటిడిఏ పివోలకు ఆదేశించారు. చింతూరు సమీపంలో ఉన్న రెడ్ క్రాస్ భవనాన్ని మరమ్మత్తులు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జనరిక్ మెడిసిన్ షాపులను నిర్వహించేందుకు అనుమతి ఇస్తామన్నారు. జనవరి 15లోగా ప్రజాప్రస్థాన వాహనాన్ని కొనుగోలు చేస్తామన్నారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయానికి 10 సెంట్లు స్థలాన్ని కేటాయించడానికి ఆమోదించారు. వ్యాపారులు ఉద్యోగులు స్వచ్ఛంద సంస్థలు రెడ్ క్రాస్ సొసైటీ కి సహకరించాలని కోరారు.

అనంతరం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కార్యవర్గంలో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ జిల్లా అధ్యక్షులుగాను, జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్ చైర్మన్ గాను, ఎస్ గంగరాజు వైస్ చైర్మన్ గాను, జి గౌరీ శంకర్ కార్యదర్శి గాను, పి సూర్యారావు కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. కార్యవర్గ సభ్యులుగా వి.జయలక్ష్మి, ఎం గంగా భవాని, ఎస్.సంజీవరావు, టి.ప్రసాద్ నాయుడు, సిహెచ్ సింహాచలం, జి సుబ్రహ్మణ్యం, డి ఆర్ టి పట్నాయక్, శ్రీనివాస్ ఆనంద్‌లను ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఓ డాక్టర్ కృష్ణారావు, రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ వి.లోహితాస్, జిసిసి కో-ఆపరేటివ్ మెంబర్ బొర్రా నాగరాజు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జీవితకాల మెంబర్లు పాల్గొన్నారు.

ముసురుతో గిరిజన రైతుల్లో ఆందోళన



ఆదరాబాదరాగా నూర్పిడి చేస్తున్న రైతులు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో గత రెండు రోజుల నుంచి చిన్న పాటి వర్షం జల్లులతో ముసురు పట్టుకుంది. వరి పంట చేతికి అందొచ్చే సమయంలో ముసురుతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పలువురు రైతులు ఆదరాబాదరాగా కుప్పలు పెడుతున్నారు. మండల వ్యాప్తంగా 18 పంచాయితీల్లో సుమారు 284 గ్రామాలు ఉండగా 87 గ్రామాల్లో వరి పంట 8535 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మండలంలోని అరమ పంచాయతీ పరిధి పరిడి జాకర వలస, గుంటగన్నెల పంచాయతీ డోమంగి, జాముగుడతో పాటు రంగిలిసింగి, గుంటసీమ, గసభ, సాగర పంచాయతీ పలు గ్రామాల్లో ఇంకా నూర్పులు పూర్తిగా చేసుకోలేదు. వరి పంటను కోతలు కోసి నూర్పుల కోసం కుప్పలు ఏర్పాటు చేశారు.ముసురు పట్టుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-కూనవరం

భూ సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు తెలిపారు. మండలంలోని పెద్దఆర్కూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రేపాక గ్రామంలో గురువారం సర్పంచ్ నాగమణి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ స్థానిక గిరిజనుల భూములకు పట్టాలు లేకపోయినా, తమ భూమి సమాచారం కావాలన్నా, భూ యజమానికి వారసత్వ చేర్పులు మార్పులకు సంబంధించిన సమస్యలను ఈ రెవెన్యూ సదస్సులో పరిష్కారం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు : రెవెన్యూ సదస్సులో రైతులు పాల్గొని తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని జీకే వీధి తహశీల్దారు రామకృష్ణ వెల్లడించారు. జీకే.వీధి మండలం రింతాడ పంచాయితీ సచివాలయంలో రెవిన్యూ సదస్సు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు డి సత్యనారాయణ, ఆర్ఐ మహదేవ్, సీనియర్ అసిస్టెంట్ చిన్నయ్య పడాల్, మండల సర్వేయరు శ్రీను, వీఆర్వో ఎస్.కృష్ణారావు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ రామకృష్ణ

ఓటరు జాబితా తయారీలో అప్రమత్తం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా కీలకమని, దాని తయారీలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల జాబితా పరిశీలకులు, ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ 2025 ప్రక్రియపై జిల్లా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏటా ఓటర్ల జాబితా సవరణ సక్రమంగా నిర్వహిస్తుంటే ఎన్నికల నాటికి పూర్తిస్థాయి ఓటర్ల జాబితా తయారు అవుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఓటర్ల తొలగింపు అంశంలో ఎలక్షన్ కమిషన్ నుంచి అభ్యంతరాలు ఉంటాయని చెప్పారు. ఇప్పుడైతే ఎటువంటి ఆంక్షలూ ఉండవన్నారు. ఓటరు నమోదు, సవరణల కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిఆర్ఒ బిహెచ్ భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాల విద్యుత్తు శాఖలను ప్రైవేటుపరం చేయొద్దు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రాల ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లను ప్రైవేట్ పరం చేయడం సరికాదని, ఇది ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జెఎసి విశాఖ జిల్లా చైర్మన్ ఎస్.చిరంజీవులు, కన్వీనర్ కెటి.భాస్కరరావు, డిస్కమ్ చైర్మన్ విఎస్ఆర్‌కె గణపతి అన్నారు. ప్రైవేటీకరణను నిరసిస్తూ గురువారం గ్రీన్ పార్క్ హోటల్‌కు ఎదురుగా ఉన్న ఎలక్ట్రిసిటీ ఎస్ఇ కార్యాలయం ఆవరణలో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్, చండీగఢ్ రాష్ట్రాల ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్‌లను ప్రైవేటుపరం చేయడానికి ప్రభుత్వాలు పూనుకున్నాయని తెలిపారు. 2022 విద్యుత్ సవరణ బిల్లు చట్టం ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి సంఘీభావంగా ఇక్కడ నిరసన చేపట్టినట్లు తెలిపారు.

క్రీడలతో ఆరోగ్యం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం సొంతం అవుతుందని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎం.ప్రణవగోపాల్ పేర్కొన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఆరిలోవ ఛాంపియన్స్ లీగ్(ఎసిఎల్) క్రికెట్ సీజన్ -1 బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యువత క్రీడల పట్ల ఆసక్తి కనబర్చాలన్నారు. అరిలోవ ఛాంపియన్స్ లీగ్ క్రికెట్ క్రీడా నిర్వాహక కమిటీ సభ్యులు డిజె.జగదీష్ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఐపిఎల్ తరహాలో 8 ఫ్రాంచైజీలతో అరిలోవ పినాకిల్ గ్రౌండ్లో క్రికెట్ మ్యాచులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు బి.మురళి, హరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : డిసెంబర్ 20 నుంచి 22వ తేదీ వరకు కాకినాడలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ చాంపియన్‌షిప్ టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన విశాఖపట్నం జిల్లా క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డివిఎస్‌వై.శర్మ ఆధ్వర్యాన గురువారం టిషర్టులు అందించారు.

ఎస్‌సి యువకులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని యువకులకు ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సత్య పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన ఎస్‌సి యువకులకు న్యాక్ ఆధ్వర్యాన స్మార్ట్ మీటర్స్ టెక్నీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రూ.7500 స్టైఫండ్ కూడా ఉంటుందని పేర్కొన్నారు. పదవ తరగతి, ఐటిఐ ఉత్తీర్ణత సాధించిన యువకులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. వివరాలకు 83090 03957 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రైతు బజార్‌లో అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఎంవిపి రైతుబజార్‌లో గురువారం జిల్లా తూనికలు కొలతల అధికారి అప్పలరాజు, ఇన్‌స్పెక్టర్ రామారావు వస్తువులు నాణ్యత, ప్రమాణాలు, తూకంలో జరిగే మోసాలపై వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొనుగోలుదారులు, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

జలపాతాల అభివృద్ధికి కృషి



జలపాతం వద్ద కూటమి నేతలు

ప్రజాశక్తి-సీలేరు : కె.వీధి మండలం జెర్రీల పంచాయతీ పరిధి కొండ్రుపల్లి, గిల్లగొంది గ్రామాల పరిసరాల్లో ఉన్న జలపాతాలు ఆకర్షణీయంగా ఉన్నాయని, వాటిని టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని టూరిజం డైరెక్టర్ కిలో రమేష్ నాయుడు, జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుత్తూరు విష్ణుమూర్తి తెలిపారు. గురువారం వారు ఆయా జలపాతాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఈ ప్రాంతానికి పర్యాటకులు వచ్చి పిక్నిక్‌లు నిర్వహించి సందడి చేశారని, దీనిని టూరిజం ప్రాంతంగా తయారు చేస్తే మారుమూల గ్రామాల అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఈ పరిసర ప్రాంతాల్లో దట్టమైన అటవీ ప్రాంతం, ఆహ్లాదకరమైన వాతావరణం ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.

అడవిలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ సిబ్బంది

ప్రజాశక్తి-సీలేరు: అడవిలో అగ్ని ప్రమాదాల నివారణ, వన్యప్రాణుల సంరక్షణ చర్యలపై జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ బూసికొండలో గిరిజనులకు సీలేరు అటవీ శాఖ రేంజ్ అధికారి ఎస్.వెంకటరావు, డిప్యూటీ రేంజ్ అధికారి సింహాచలంపడాల్ గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే విలువైన వృక్ష సంపద నాశనమవుతుందని, వన్యప్రాణులు మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, దీనివల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో కాల్చిన సిగరెట్లు బీడీలు విచ్చలవిడిగా పడవేయరాదని, ముఖ్యంగా పశువుల కాపరులు, జీలిగ కళ్ళు, అటవీ ఉత్పత్తులు సేకరించడానికి వెళ్లిన వ్యక్తులు అడవి బాటలో అగ్నికి కారణమైన వస్తువులు తీసుకెళ్లరాదని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అటవీ ప్రాంతాల దగ్గరలో ఉన్న గ్రామస్తులు మంటలను ఆర్పి కాపాడవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ కే.దుర్గాప్రసాద్, అటవీ శాఖ సిబ్బంది, మాజీ సర్పంచ్ కేలేబు చెల్లయమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్వాడీ హెల్పర్ల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-అడ్డతీగల : అడ్డతీగల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అడ్డతీగల మండల కేంద్రంలో ఏడు హెల్పర్ పోస్టులు, వై.రామవరం మండలంలో 9 హెల్పర్ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఐసిడిఎస్ సిడిపిఓ వై.సుధా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్డతీగల మండలంలో వెంకటనగరం, చిక్కపుగడ్డ, మాకవరం, రేగడి వీధి, పినికిలపాడు, తీయమామిడి, రోలగడ్డ, వై.రామవరం మండలంలో పసరు గిన్ని, సింహాద్రిపాలెం, సింగవరం, మునకలపూడి, కోకితగొంది, బొడ్డపల్లి, కొమరవరం, గోరామంద, పైడి పొట్ట అంగన్వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, 2024 జులై 1 నాటికి 21 సంవత్సరాల నుండి 35 ఏళ్ల లోపు వయస్సు ఉండి, స్థానికులైన వారు ఈపోస్టులకు అర్హులని ఆమె పేర్కొన్నారు.

బాలికల గురుకులంలో సౌకర్యాలు మెరుగుపర్చాలి

సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని కోతులగుట్ట గురుకుల బాలికల పాఠశాలలో సౌకర్యాలు మెరుగుపర్చాలని సీపీఎం ప్రజా ప్రతినిధులు, నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు పాఠశాలను సందర్శించి పరిసరాలను, మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య మాట్లాడుతూ 705 మంది పాఠశాల, ఇంటర్ విద్యార్థులు చదువుతున్నారని, హాస్టల్‌లో అపారిశుధ్యం తాండవిస్తుందని పేర్కొన్నారు. హాస్టల్‌లో 65 మరుగుదొడ్లు ఉండగా, వాటిలో 12 మాత్రమే పనికి చేస్తున్నాయని తెలిపారు. సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్ర పరిచి మూడేళ్లు అవుతందని, అంత మందికి ఇద్దరు మాత్రమే శానిటేషన్ సిబ్బంది ఉన్నారని తెలిపారు. పాఠశాలలో ఉన్న 4 మోటార్ బోర్లకు ఒకటి మాత్రమే పనికి చేస్తుందని, ఆర్ఓ ప్లాంటు ఉన్నా అది రెండేళ్ల నుండి పని చేయడం లేదని, దీంతో తాగడానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి విద్యార్థినులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 705 మందికి 35 మంది ఉపాధ్యాయులు ఉండగా, వారిలో 28 మంది అవుట్ సోర్సింగ్ టీచర్ల అని, వారు తమ డిమాండ్లపై రెండు నెలలుగా ఆందోళన చేస్తుండడంతో చదువు సాగడం లేదని పేర్కొన్నారు. పాఠశాల పరిసరాలు అడవిని తలపిస్తున్నాయని, హాస్టల్‌కి ప్రహరీ లేక ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని విద్యార్థినులు భయంతో కాలం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, ఎంపీటీసీ జయసుధ, సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, నాయకులు శంకర్, తాళ్లూరి శ్రీనివాసరావు, పాయం సత్యనారాయణ, గిరిజన సంఘం నాయకులు తమ్మయ్య, బాబురావు పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలతో నిండిన గురుకుల ఆవరణ పరిశీలిస్తున్న సిపిఎం బృందం

ప్రిన్సిపాల్ విజయలక్ష్మి వివరణ :

'నేను ఈ మధ్య కాలంలో రావడం జరిగింది. సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నాం. కాంట్రాక్టర్‌లను పిలిపించాం. త్వరలోనే పరిస్థితులను చక్క దిద్దుతాం' అని ప్రిన్సిపల్ విజయలక్ష్మి చెప్పారు.







వృథాగా ఉన్న బోరు పాయింట్ , అలంకారప్రాయంగా ఉన్న కుళాయిలు, మూలకు చేరిన మినరల్ వాటర్ ప్లాంట్ పరిశీలిస్తున్న సిపిఎం బృందం ప్రతినిధులు

తాగునీటి శుద్ధి పరిజ్ఞానంపై అవగాహన

గీతం వర్సిటీని సందర్శించిన రసాయన శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని ప్రముఖ రసాయన శాస్త్రవేత్త, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఐఐటి చెన్నై సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ టి.ప్రదీప్ గురువారం సందర్శించారు. దాదాపు 100కు పైగా ఆవిష్కరణలకు పేటెంట్ హక్కులు పొందిన డాక్టర్ ప్రదీప్, తాగునీటిని శుద్ధి చేసే పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడంతో పాటు పంటలలో వినియోగించే క్రిమి సంహారకాలను దిగుబడి అనంతరం తొలిగించే సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించారు. దాదాపు 550కి పైగా పరిశోధన పత్రాలను వెలువరించిన డాక్టర్ ప్రదీప్‌కు శాంతి స్వరూప్ భట్నాగర్ వంటి ప్రతిష్టాత్మక అవార్డుతో పాటు బిఎం.బిర్లా సైన్స్ ప్రైజ్, జేసి బోస్ నేషనల్ ఫెలోషిప్, ఇండియా నానోటెక్ ఇన్నోవేషన్ అవార్డులు వరించాయి.

ఈ సందర్భంగా నూతన పదార్థ విజ్ఞానం ఆధారంగా స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి తాను రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానం గురించి గీతం పరిశోధకులకు డాక్టర్ ప్రదీప్ వివరించారు. అనంతరం స్కూల్ ఆఫ్ సైన్స్ పరిశోధకులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. అనంతరం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం తరుపున గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ తదితరులు డాక్టర్ ప్రదీప్‌ను సన్మానించారు.కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరన్‌దాస్, గీతం విశిష్ట ప్రొఫెసర్, మూర్తి ప్రయోగ శాలల అధిపతి ప్రొఫెసర్ బివిఆర్ టాటా, గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ జివిఆర్ శర్మ పాల్గొన్నారు.



శాస్త్రవేత్త ప్రదీప్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డులోని జీసస్ పార్కులో భీమిలి, వైఎంసిఎ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వైఎంసిఎ విశాఖ సబ్ రీజినల్ వైస్‌చైర్మన్ కెఎస్ఎం సుధాకర్ అధ్యక్షతన కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. ఐవేడుకల్లో స్థానిక సిఐ బి సుధాకర్, మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు, భీమిలి, తగరపువలస ఆంధ్రా బాప్టిస్టు చర్చి అధ్యక్షులు వై లివింగ్‌స్టన్, గండి జాన్‌ప్రకాష్, కార్యదర్శి ఆల్బర్ట్ సుదర్శన్, ప్రేమానందం, ఫాస్టర్లు విజయకుమార్, విలియం సునీత్‌బాబు, ప్రభాకర్, కృపారావు పాల్గొన్నారు. బాల బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సిహెచ్‌సిని సందర్శించిన రాష్ట్ర బృందం

ప్రజాశక్తి- కూనవరం : కూనవరం మండలం కోతులగుట్ట సీహెచ్‌సీని ఏపీ మెడికల్ అండ్ హెల్త్, హెల్త్ వెల్ అవేర్నెస్ సెంటర్ రాష్ట్ర బృందం బుధవారం సందర్శించింది. ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను సూపరింటెండెంట్ కె.మహేష్ బాబును అడిగి తెలుసుకున్నారు. కూనవరం ఎన్ఆర్‌సీ సెంటర్లో రోజుకు ఎంతమంది పిల్లలు అడ్మిట్ అవుతున్నారు, వారికి ఎలాంటి పౌష్టికాహారం అందిస్తున్నారో రాష్ట్ర బృందం సభ్యులు డాక్టర్ సుబ్రమణ్యం ఆరా తీశారు. ఆసుపత్రిలో నెలకు ఎన్ని డెలివరీలు జరుగుతున్నాయని అడిగారు. ఆసుపత్రిలో రోగులకు కావలసిన సౌకర్యాలను కల్పించేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు వైద్య సేవల కోసం ఆశ వర్కర్లు మంచి సహకారం అందిస్తున్నట్లు ప్రతి ప్రాంతంలో కనిపించిందని ఆయన ప్రశంసించారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ పి శ్వేత, డాక్టర్ సి.తేజ, డాక్టర్ ప్రజ్వల, హెడ్ నర్స్ బి.బుజ్జి, ఫార్మసీ ఆఫీసర్ దృష్టి జోగారావు, సిబ్బంది దేవి ప్రసన్న, సుబ్బారావు, ఇందు అనసూయ, ఎన్ఆర్సి కౌన్సిలర్ కే రమేష్ తులసి, ఎన్‌హెచ్ ఎం దారయ్య, నగేష్, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

ఏరియా ఆసుపత్రికి ఇన్వర్టర్ వితరణ



ఇన్వర్టర్ అందజేస్తున్న డాక్టర్ జమాల్‌ఖాన్

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులు, వైద్య సిబ్బంది సౌకర్యార్థం ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ గురువారం రూ.29 వేలు విలువ గల ఇన్వర్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముంపు మండలాల్లో వరదల సమయంలో నిర్వాసితులకు ఆహారం, దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేయడంతో పాటు అగ్ని ప్రమాద బాధితులకు ఇంటి నిర్మాణానికి కావాలసిన సామాగ్రిని జమాల్ ఖాన్ తమ జెకెసి ట్రస్టు ద్వారా అందిస్తున్నారని తెలిపారు. తాగునీటి సమస్యలు ఉన్న గ్రామాల్లో మంచి నీటి బోర్లు వేయిస్తున్నారని, పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక సాయం అందిస్తున్నారని పేర్కొన్నారు. జమాల్ ఖాన్‌ను ఆదర్శంగా తీసుకొని సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ శేషారెడ్డి, డాక్టర్ ప్రేమ్ ఏవో హెడ్నర్స్ దుర్గ, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువతపై అక్రమ కేసులు సరికాదు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న విష్ణుమూర్తి

ప్రజాశక్తి-సీలేరు: జీకే వీధి మండలంలోని పలు పంచాయతీల్లో గంజాయి పేరుతో గిరిజన యువతపై అక్రమంగా కేసులు పెడుతున్నారని, వాటిని వెంటనే నిలిపివేయాలని సిపిఐ నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకరి విష్ణుమూర్తి మాట్లాడుతూ జీకే వీధి మండలంలోని దారకొండ, గుమ్మరేవులు దుప్పిలివాడ పంచాయతీల్లో పలు గ్రామాల్లో ఉన్న గిరిజన యువతి యువకులపై గంజాయి రవాణాకు సంబంధం లేకుండానే రవాణాలో పాల్గొన్నారని చెప్పి అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. ఎక్కడో జరిగిన సంఘటన ఆధారంగా తీసుకుని సంబంధం లేని యువకులపై గంజాయి కేసు బనాయించడం దారుణమన్నారు. గుమ్మరేవుల పంచాయతీ నేలజట్టుకు చెందిన తుంకరు బుజ్జిబాబు అనే వ్యక్తిని ఈ ఏడాది ఆగస్టు 13న బలవంతంగా మారేడుమిల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారని, క్రైమ్ నెంబర్ 53/2023 కేసుతో ఎటువంటి సంబంధం లేని కొర్ర నారాయణను అరెస్టు చేసి విశాఖ సెంట్రల్ జైల్‌కు తరలించారని పేర్కొన్నారు. ఇటువంటి అక్రమ కేసులు పెట్టడం వల్లనే యువత సంఘవిద్రోహశక్తులుగా మారుతున్నారన్నారు. ఇప్పటికైనా అక్రమ కేసులు ఆపకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.